18-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి “అవ్యక్త బాప్ దాదా” రివైజ్ 18-01-24
మధువనం

పితాశ్రీగారి పుణ్య స్మృతి దివసము నాడు వినిపించేందుకు బాప్ దాదా యొక్క మధుర మహావాక్యాలు

“మధురమైన పిల్లలూ - బాబా హృదయములో పిల్లలను సదా సుఖమయముగా చెయ్యాలన్న ఫస్ట్ క్లాస్ ఆశ ఉంటుంది, నా పిల్లలు యోగ్యులుగా అయ్యి స్వర్గానికి యజమానులుగా అవ్వాలన్నదే బాబా కోరుకుంటారు”

ఓం శాంతి. ఇప్పుడు భగవంతుడు సమ్ముఖముగా కూర్చుని మనకు జ్ఞాన గీతాలను వినిపిస్తారు మరియు జ్ఞాన నాట్యం చేయిస్తారు అని పిల్లలకు తెలుసు. ఈ జ్ఞాన నాట్యముతో మీరు దేవతల వలె సదా సుఖమయముగా మరియు హర్షితముగా ఉంటారు. భగవంతుడినే అనంతమైన తండ్రి లేక విశ్వ రచయిత అని అంటారు. బాబా మా కొరకు స్వర్గమనే కానుకను తీసుకువచ్చారు అని ఆత్మ భావిస్తుంది. వారే రచయిత. స్వర్గానికి యజమానులుగా చేసేందుకు రాజయోగాన్ని నేర్పిస్తారు. తండ్రిని మరియు విశ్వ యజమానత్వాన్ని గుర్తు చెయ్యండి అని చెప్తారు. తండ్రి అనంతమైన యజమాని కనుక తప్పకుండా అనంతమైన పెద్ద ప్రపంచమునే రచిస్తారు. పిల్లలైన మీ కొరకు మొత్తము విశ్వమే ఇల్లు వంటిది అనగా పాత్రను అభినయించే స్థానము. అనంతమైన తండ్రి వచ్చి అనంతమైన విశ్వాన్ని లేక ఇంటిని తయారుచేస్తారు, అదే స్వర్గము. మరి అటువంటి తండ్రికి పిల్లలు ఎంతగా కృతజ్ఞతలను తెలపాలి. విశ్వ రచయిత అయిన తండ్రి డైరెక్టుగా అర్థం చేయిస్తున్నారు - నేను మిమ్మల్ని విశ్వానికి యజమానులుగా తయారుచేయడానికి వచ్చాను కనుక మీ స్వభావము చాలా ఫస్ట్ క్లాస్ గా ఉండాలి. మీ నడవడిక ఎలా ఉండాలంటే - వీరు దేవతలా ఉన్నారు అని అందరూ అనాలి. దేవతలు ప్రసిద్ధమైనవారు. వీరి స్వభావము పూర్తిగా దేవతలా ఉంది, వీరు పూర్తిగా మధురమైన శాంత స్వభావము కలవారు అని అంటారు. ఇటువంటి పిల్లలను చూసి తండ్రి కూడా సంతోషిస్తారు. బాబా స్వర్గానికి యజమానులుగా చేయడానికి వస్తారు కనుక మీరు ఎంతటి సహాయకులుగా అవ్వాలి. సేవలో మీ అంతట మీరే నిమగ్నమైపోవాలి. అంతేకానీ నేను అలసిపోయాను, తీరిక లేదు అని అనకూడదు. అన్ని పనులు సరైన సమయానికి చెయ్యటంలోనే కళ్యాణము ఉంది. యజ్ఞ సేవ చేసినందుకు బహుమానమును శివబాబా ఇస్తారు. బాబా పిల్లల యొక్క దైవీ నడవడికను చూసినప్పుడు బలిహారమైపోతారు.

పిల్లలైన మీరు ఈ చదువు ద్వారా ఎంత ఉన్నతమైన సంపాదనను చేసుకుంటారు. మీరు పదమా-పదమపతులుగా అవుతారు. బాబా మిమ్మల్ని ఎంతటి ధనవంతులుగా తయారుచేస్తారు. బాబా మిమ్మల్ని తరగని ఖజానాలతో ఎలా తూకం వేస్తారంటే, అవి మీకు 21 జన్మలు తోడుగా ఉంటాయి. అక్కడ దుఃఖము అన్న పేరే ఉండదు. ఎప్పుడూ అకాల మృత్యువు జరుగదు. మృత్యువుకు ఎప్పుడూ భయపడరు. ఇక్కడ ఎంతగా భయపడతారు, ఎంతగా ఏడుస్తారు. మీకైతే ఈ పాత శరీరాన్ని వదిలి వెళ్ళి క్రొత్త ప్రపంచములో యువరాజుగా అవుతాము అని సంతోషం ఉంది. మీరు ఈ పాత ప్రపంచము నుండి మమకారాన్ని తొలగించుకుంటూ ఉండండి, ఈ దేహాన్ని కూడా మర్చిపోతూ వెళ్ళండి. ఆత్మలమైన మనము స్వతంత్రులము. కేవలం ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు. జీవిస్తూ ఉండగానే మృత్యు అవస్థలో ఉండాలి. ఈ ప్రపంచము నుండి చనిపోయారు. మీరు మరణించినట్లయితే మీకు సంబంధించినంత వరకు ప్రపంచము మరణించినట్లే అని అంటారు కూడా కదా. శరీర భానాన్ని తొలగిస్తూ ఉండండి. ఏకాంతములో కూర్చుని ఈ అభ్యాసము చెయ్యండి - బాబా, ఇప్పుడు ఇక మేము మీ ఒడిలోకి చేరిపోతున్నాము, అంతే. ఒక్కరి స్మృతిలో శరీరము అంతమవ్వాలి - దీనినే ఏకాంతము అని అంటారు.

మధురమైన పిల్లలూ, ఇంతటి ఉన్నతమైన చదువును చదివించేవారు ఎవరు అన్నది మీకు తెలుసు. ఈ చైతన్యమైన డబ్బాలో చైతన్య వజ్రము కూర్చుని ఉన్నారు, వారే సత్ చిత్ ఆనంద స్వరూపులు. సత్యమైన తండ్రి మీకు సత్యాతి-సత్యమైన శ్రీమతాన్ని ఇస్తారు. బాబాకు చెందినవారిగా అయ్యారు కనుక అడుగడుగునా శ్రీమతముపై నడవాలి. మౌనంగా ఉండాలి మరియు చదువుకోవాలి, ఒక్క తండ్రినే స్మృతి చెయ్యాలి. ఘడియ-ఘడియ ఈ బ్యాడ్జీను చూసుకుంటూ ఉన్నట్లయితే తండ్రి మరియు వారసత్వము గుర్తుకొస్తాయి. స్మృతి ద్వారానే మీరు మొత్తము విశ్వానికి శాంతి దానమును ఇస్తారు. పిల్లలు ప్రతి ఒక్కరూ తమ ప్రజలను కూడా తయారుచేసుకోవాలి, వారసులను కూడా తయారుచేసుకోవాలి. ఏ మురళిని మిస్ చెయ్యకూడదు. బాబా చాలా ప్రేమగా అర్థం చేయిస్తారు - మధురమైన పిల్లలూ,

మీపై మీరు దయ చూపించుకోండి, ఎటువంటి ఆజ్ఞను ఉల్లంఘించకండి.

సుగంధభరితమైన పుష్పాలు ఎవరైతే ఉన్నారో, వారు ఆకర్షిస్తారు. ఎవరు ఎటువంటివారో అటువంటి సెర్చ్ లైట్ ను తీసుకునే విధముగా ఆకర్షిస్తారు. సుగంధభరితమైన, గుణవంతులైన పిల్లలను చూస్తే ప్రేమతో, సంతోషముతో కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఏదైనా కష్టము ఉంటే బాబా సెర్చ్ లైట్ ను ఇస్తారు.

బాబా అర్థం చేయిస్తారు - మధురమైన పిల్లలూ, మీరు ఈ పాత ప్రపంచముపై ఎటువంటి ఆశనూ పెట్టుకోకూడదు. ఇప్పుడైతే ఒకే ఒక్క శ్రేష్ఠ ఆశను పెట్టుకోవాలి, అదేమిటంటే - మేము సుఖధామానికి వెళ్ళాలి. ఎక్కడా ఆగకూడదు, ఎటూ చూడకూడదు, ముందుకు వెళ్తూ ఉండాలి. ఒక వైపే చూస్తూ ఉండండి, అప్పుడే అచలమైన, నిశ్చలమైన, స్థిరమైన అవస్థ ఉంటుంది. ఇప్పుడు ఈ ప్రపంచము అంతమయ్యేదే ఉంది, దీని పరిస్థితి చాలా సీరియస్ గా ఉంది. ఈ సమయంలో అందరికంటే ఎక్కువ కోపం ప్రకృతికి వస్తుంది, అందుకే అన్నింటినీ అంతం చేసేస్తుంది. ఈ ప్రకృతి ఇప్పుడు తన కోపాన్ని చాలా తీవ్రముగా చూపించనున్నది అని మీకు తెలుసు. మొత్తం పాత ప్రపంచాన్ని ముంచేస్తుంది. భూకంపములో ఇళ్ళు మొదలైనవన్నీ పడిపోతాయి. అనేక రకాలుగా మృత్యువు జరుగుతుంది. ఇదంతా డ్రామా ప్లాన్ గా తయారై ఉంది. ఇందులో ఎవరి దోషమూ లేదు. వినాశనమైతే జరిగేదే ఉంది, అందుకే మీరు దీని నుండి బుద్ధియోగాన్ని తొలగించివేయాలి. మీరైతే మీ సర్వస్వాన్నీ ఇన్స్యూర్ చేసేసారు, అందుకే మీకు ఎటువంటి చింత లేదు. మీదంతా సఫలమవుతూ ఉంది.

ఇప్పుడు మీరు అంటారు - వాహ్ సద్గురువు వాహ్! మీరు మాకు ఈ దారిని చూపించారు. వాహ్ నా భాగ్యము వాహ్! వాహ్ డ్రామా వాహ్! మీ హృదయములో నుండి వస్తుంది - బాబా, మీకు ధన్యవాదాలు, మీరు మా నుండి రెండు పిడికెళ్ళ బియ్యాన్ని తీసుకుని మాకు సురక్షితంగా భవిష్యత్తులో వంద రెట్లు రిటర్న్ ఇస్తారు. కానీ ఇందులో కూడా పిల్లలకు చాలా విశాల బుద్ధి ఉండాలి. పిల్లలకు అపారమైన జ్ఞాన ధనము యొక్క ఖజానా లభిస్తూ ఉంటుంది కనుక అపారమైన సంతోషము ఉండాలి కదా. హృదయము ఎంతగా శుద్ధముగా ఉంటుందో, అంతగా ఇతరులను కూడా శుద్ధముగా చేస్తారు. యోగ స్థితి ద్వారానే హృదయము శుద్ధముగా అవుతుంది. పిల్లలైన మీకు యోగీగా అవ్వాలి మరియు తయారుచెయ్యాలి అన్న అభిరుచి ఉండాలి. ఒకవేళ దేహముపై మోహము ఉంటే, దేహ-అభిమానము ఉంటే, అప్పుడిక మా అవస్థ చాలా కచ్చాగా (అపరిపక్వంగా) ఉంది అని భావించండి. దేహీ-అభిమానీ పిల్లలే సత్యమైన వజ్రంగా అవుతారు, అందుకే ఎంత వీలైతే అంత దేహీ-అభిమానులుగా అయ్యే అభ్యాసము చెయ్యండి. తండ్రిని స్మృతి చెయ్యండి. బాబా అన్న పదము అన్నింటికన్నా చాలా మధురమైనది. బాబా చాలా ప్రేమతో పిల్లలను తన కనురెప్పలపై కూర్చోబెట్టుకుని తమతోపాటు తీసుకువెళ్తారు. ఇటువంటి బాబా స్మృతి యొక్క నషాలో ముక్కలు ముక్కలైపోవాలి (మునిగిపోవాలి). బాబాను స్మృతి చేస్తూ-చేస్తూ సంతోషంలో చల్లబడిపోవాలి. బాబా ఏ విధంగా అపకారులకు కూడా ఉపకారము చేస్తారో, అలా మీరు కూడా బాబాను ఫాలో చెయ్యండి. సుఖాన్ని ఇచ్చేవారిగా అవ్వండి. పిల్లలు యోగ్యులుగా అయ్యి స్వర్గానికి యజమానులుగా అవ్వాలి అని బాబా హృదయములో పిల్లలను సదా సుఖమయముగా చెయ్యాలన్న ఎంత ఫస్ట్ క్లాస్ ఆశ ఉంటుంది.

పిల్లలైన మీకు ఇప్పుడు డ్రామా రహస్యము కూడా తెలుసు - బాబా మీకు నిరాకారీ, ఆకారీ మరియు సాకారీ ప్రపంచముల మొత్తము సమాచారాన్ని వినిపిస్తారు. ఆత్మ అంటుంది - ఇప్పుడు మేము కొత్త ప్రపంచములోకి వెళ్ళేందుకు పురుషార్థము చేస్తున్నాము, మేము స్వర్గములోకి వెళ్ళేందుకు యోగ్యులుగా తప్పకుండా అవుతాము, స్వయము మరియు ఇతరుల యొక్క కళ్యాణమును చేస్తాము. అచ్ఛా - బాబా మధురమైన పిల్లలకు అర్థం చేయిస్తారు, బాబా దుఃఖహర్త-సుఖకర్త కనుక పిల్లలు కూడా అందరికీ సుఖాన్ని ఇవ్వాలి, బాబాకు కుడి భుజంగా అవ్వాలి. ఇటువంటి పిల్లలే బాబాకు ప్రియముగా అనిపిస్తారు. శుభ కార్యములో కుడి చేతినే ఉపయోగిస్తారు. కనుక బాబా అంటారు - ప్రతి విషయములోనూ ధర్మయుక్తముగా అవ్వండి, ఒక్క బాబానే గుర్తు చేయండి, అప్పుడిక అంతిమ స్మృతిని బట్టి జన్మ లభిస్తుంది. ఈ పాత ప్రపంచముపై మమకారాన్ని తొలగించుకోండి. ఇది స్మశానవాటిక. వ్యాపార-వ్యవహారాలు, పిల్లలు మొదలైనవాటి చింతనలో చనిపోయినట్లయితే అనవసరముగా మిమ్మల్ని మీరు నష్టపరచుకుంటారు. శివబాబాను స్మృతి చేసినట్లయితే మీరు చాలా సంపన్నముగా అవుతారు. దేహ-అభిమానములోకి రావటముతో నష్టపోతారు. దేహీ-అభిమానులుగా అవ్వటముతో సంపన్నముగా ఉంటారు. ధనముపై కూడా చాలా అత్యాశ పెట్టుకోకూడదు. దాని చింతలో శివబాబాను కూడా మర్చిపోతారు. పిల్లలు తమ సర్వస్వమును బాబాకు అర్పించి శ్రీమతముపై ఎంతవరకు నడుస్తున్నారు అన్నది బాబా చూస్తారు. ప్రారంభములో

బాబా కూడా ట్రస్టీగా అయ్యి చూపించారు కదా. సర్వస్వమును ఈశ్వరార్పణము చేసి స్వయం ట్రస్టీగా అయిపోయారు. కేవలం ఈశ్వరుని కార్యములోనే పెట్టాలి, అంతే. విఘ్నాలకు ఎప్పుడూ భయపడకూడదు. ఎంత వీలైతే అంత సర్వీస్ లో తమ సర్వస్వమును సఫలము చేసుకోవాలి. ఈశ్వరార్పణము చేసి ట్రస్టీగా అయ్యి ఉండాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

అవ్యక్త మహావాక్యాలు (రివైజ్ - **15-4-74**)

అందరూ ఉన్నతి వైపుకు వెళ్తూ ఉన్నారా? సదా లగనములో మగ్నమై ఉండటము మరియు విఘ్న-వినాశకులుగా ఉండటము, ఈ రెండు లక్షణాలు అనుభవంలోకి వస్తున్నాయా? విఘ్న-వినాశకులుగా అయ్యేందుకు బదులుగా, విఘ్నాలను చూసి మీ స్థితి నుండి కిందకైతే రావటం లేదు కదా? అనేక రకాలుగా వచ్చే తుఫానులు మీ బుద్ధిలో తుఫానునైతే సృష్టించటం లేదు కదా? ఎలాగైతే ఎవరి నుండైనా కానుక లభిస్తే బుద్ధిలో అలజడి కలగదు కానీ ఉల్లాసము కలుగుతుందో, అలాగే మీకు వచ్చే తుఫానులు మీలో ఉల్లాసాన్ని పెంచుతాయా లేక అలజడిని పెంచుతాయా? ఒకవేళ తుఫానును తుఫానుగా భావిస్తే అలజడి కలుగుతుంది మరియు కానుకగా భావిస్తే లేక అలా అనుభవము చేస్తే దాని వల్ల ఉల్లాసము మరియు ధైర్యము ఇంకా పెరుగుతాయి. ఇది ఎక్కే కళకు గుర్తు. గాభరాపడేందుకు బదులుగా లోతులలోకి వెళ్ళి అనుభవాలనే క్రొత్త-క్రొత్త రత్నాలను ఈ పరీక్షల సాగరము నుండి ప్రాప్తి చేసుకుంటారు ఎందుకంటే అలజడి లోపల రత్నాలు దాగి ఉన్నాయి. పైపైన అనగా బాహ్యాముఖత యొక్క దృష్టి మరియు బుద్ధితో చూసినట్లయితే అలజడి కనిపిస్తుంది లేక అనుభవమవుతుంది, కానీ ఆ వచ్చిన విషయాలనే అంతర్ముఖీ దృష్టి మరియు బుద్ధితో చూసినట్లయితే అనేక రకాల జ్ఞాన రత్నాలు అనగా పాయింట్లు ప్రాప్తిస్తాయి.

ఒకవేళ ఏ విషయాన్ని అయినా చూస్తూ లేక వింటూ ఉన్నప్పుడు ఆశ్చర్యమనిపిస్తే అది కూడా ఫైనల్ స్టేజ్ (అంతిమ స్థితి) కాదు. అలా జరిగి ఉండాల్సింది కాదు... డ్రామానుసారంగా జరిగినప్పుడు ఒకవేళ ఇటువంటి సంకల్పము ఉత్పన్నమైనా సరే, దానిని కూడా అంశమాత్రమైన అలజడి రూపమనే అంటారు. ఇప్పటివరకు కూడా ఎందుకు-ఏమిటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయంటే దాని అర్థము అలజడి కలుగుతుందని. విఘ్నాలు రావటం ఎంతగా తప్పనిసరియో, అంతగానే విఘ్న-వినాశక స్థితిలో ఉండటము, ఇదే హర్షితముగా ఉండేందుకు సాధనము. నథింగ్ న్యూ (క్రొత్తేమీ కాదు), ఇదే ఫైనల్ స్టేజ్ (అంతిమ స్థితి). ఒకవేళ ఏదైనా అలజడి కలిగించే కర్తవ్యము చేసినా లేక పాత్రను అభినయించినా సాగరము సమానంగా పైకి అలజడి కనిపించినా కానీ అనగా కర్మేంద్రియాల అలజడిలోకి వస్తున్నా కానీ స్థితి మాత్రం నథింగ్ న్యూ (క్రొత్తేమీ కాదు) అన్నట్లు ఉండాలి. ఏకాగ్రముగా, ఏకరసముగా, ఏకాంతముగా అనగా ఒక్క రచయిత మరియు రచనల అంతములను తెలిసిన త్రికాలదర్శి స్థితిలో ప్రశాంతముగా శాంతి స్థితిలో స్థితులై ఉన్నారా లేక కర్మేంద్రియాల అలజడి ఆంతరిక స్థితిని కూడా కదిలించివేస్తుందా? స్థూల సాగరము రెండు రూపాలనూ చూపిస్తుంది అన్నప్పుడు మరి మాస్టర్ జ్ఞాన సాగరులు అటువంటి రూపాన్ని చూపించలేరా? ఈ ప్రకృతి పురుషుడి నుండి కాపీ చేసింది. మీరైతే పురుషోత్తములు. ప్రకృతి తన లక్షణాన్ని చూపించగలుగుతున్నప్పుడు మరి పురుషోత్తములు చూపించలేరా?

ఇప్పుడు సమయము అతి వైపుకు వెళ్తూ ఉంది. అన్ని వైపులా అతి కనిపిస్తూ ఉంది. అంతిమానికి గుర్తు అతి. కనుక ఏ విధంగా ప్రకృతి సమాప్తి వైపుకు అతిలోకి వెళ్తూ ఉందో, అదే విధంగా సంపన్నముగా అయ్యే ఆత్మల ఎదురుగా ఇప్పుడు పరీక్షలు మరియు విఘ్నాలు కూడా అతి రూపములో వస్తాయి, అందుకే - ఇంతకుముందు ఇలా లేదే, ఇప్పుడు ఎందుకు ఇలా ఉంది అని ఆశ్చర్యపడకూడదు. ఇటువంటి ఆశ్చర్యము కూడా ఉండకూడదు. ఫైనల్ పరీక్షలో ఆశ్చర్యకరమైన విషయాలు ప్రశ్నల రూపములో వస్తాయి, అప్పుడే పాస్ లేక ఫెయిల్ అవ్వగలరు. ఎటువంటి విషయాలు వస్తాయంటే వద్దనుకున్నా కూడా బుద్ధిలో ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మరి ఇదే కదా పరీక్ష అంటే. అది కూడా ఒక్క సెకండు యొక్క పరీక్ష వస్తుంది. 'ఎందుకు' అనే సంకల్పము చంద్రవంశీయుల క్యూలో నిలబెట్టేస్తుంది, అందుకే ఏకరస స్థితిలో స్థితులయ్యే అభ్యాసము నిరంతరము ఉండాలి. సమస్య అనే సీట్ ను సంభాళించటములో నిమగ్నమైపోకండి. కానీ సీట్ పై కూర్చుని సమస్యను ఎదుర్కోవాలి. ఇప్పటివరకు సమస్య సీట్ ను గుర్తు తెప్పిస్తుంది. విఘ్నము వచ్చినప్పుడు విశేషంగా యోగాన్ని జోడిస్తారు మరియు భట్టీని పెట్టుకుంటారు. దీని ద్వారా ఏం ఋజువవుతుందంటే శత్రువే శస్త్రము యొక్క స్మృతిని కలిగిస్తుంది, అంతేకానీ స్వతహాగా మరియు సదా స్మృతి

ఉండటము లేదు. నిరంతర యోగులా లేక అంతరము ఉన్న యోగులా? నిరంతర యోగీ అన్నదే కదా మీ టైటిల్! శత్రువు రానే రాకూడదు, సమస్య మిమ్మల్ని ఎదిరించనే లేకపోవాలి. శూలము నుండి ముల్లులా అవ్వటము, ఇది కూడా ఫైనల్ స్టేజ్ (అంతిమ స్థితి) కాదు. శూలము నుండి ముల్లులా అయ్యేందుకు బదులుగా ముల్లును యోగాగ్నితో దూరము నుండే భస్మము చేసెయ్యండి. ముల్లు గుచ్చుకోవటము, ఆ తరువాత దానిని తీయటము, ఇది ఫైనల్ స్టేజ్ (అంతిమ స్థితి) కాదు. ముళ్లను మీ సంపూర్ణ స్థితి ద్వారా సమాప్తము చేసెయ్యటము, ఇదే ఫైనల్ స్టేజ్. ఇటువంటి లక్ష్యాన్ని పెట్టుకుంటూ మీ స్థితిని ఎక్కే కళ వైపుకు ముందుకు తీసుకుపోతూ వెళ్ళండి. పెద్ద విషయాన్ని చిన్నదిగా అనుభవము చెయ్యటము, ఈ స్థితి వరకు నంబరువారుగా యథాశక్తి చేరుకున్నారు. ఇప్పుడు ఎక్కడి వరకు చేరుకోవాలంటే ఆ అంశము మరియు వంశము కూడా సమాప్తమైపోవాలి.

మీరందరూ సదా ధైర్యంగా, ఉల్లాసంగా మరియు సర్వుల సహయోగులుగా ఉంటూ నడుస్తున్నారు కదా! కలియుగ ప్రపంచాన్ని సమాప్తము చేసేందుకు లేక పరివర్తన చేసేందుకు, మాయకు వీడ్కోలు ఇచ్చేందుకు సంగఠనతో చుట్టుముట్టారు కదా! గట్టిగా చుట్టుముట్టారా లేక మధ్యమధ్యలో ఎవరైనా ఢీలాగా అయిపోతున్నారా అనగా అలసిపోతున్నారా లేక నడుస్తూ-నడుస్తూ ఆగిపోతున్నారా? ముందుకూ వెళ్ళరు, వెనక్కూ రారు, ఎలా ఉన్నవారు అలానే ఉండిపోవటము అని ఈ పాఠాన్ని అయితే పక్కా చెయ్యటం లేదు కదా? సమయం ముందుకు తోస్తే నడుస్తాము అని ఇలా ఆలోచిస్తూ ఎక్కడ ఉన్నవారు అక్కడే ఆగిపోలేదు కదా? ఎవరి నుండైనా ఏ ఆధారము కోసమైనా ఎదురుచూస్తూ నిలబడిపోలేదు కదా? ఇటువంటి స్థితి కలవారిని ఏమంటారు? దీనినే అంగద సమాన స్థితి అని అనుకుంటున్నారా? ఒకవేళ ఇలా ఆగిపోతే, చివరిలోనివారు వేగంగా వెళ్ళిపోతారు. పర్వతాలపై మంచు పడి గడ్డ కట్టినప్పుడు మార్గం మూసుకుపోతుంది, అప్పుడు ఆ మంచును కరిగించేందుకు లేక ఆ అడ్డును తొలగించేందుకు పురుషార్థం చేస్తారు. ఇక్కడ కూడా ఒకవేళ మంచులా గడ్డ కట్టేస్తే, యోగాగ్ని తక్కువగా ఉంది అని నిరూపణ అవుతుంది. యోగాగ్నిని తీవ్రతరం చేస్తే అడ్డు తొలగి దారి క్లియర్ అయిపోతుంది. మీకు లభించిన ధైర్యము మరియు ఉల్లాసము యొక్క పాయింట్లను బుద్ధిలో మననం చేస్తే దారి క్లియర్ అయిపోతుంది. పురుషార్థపు గతిలో అంగదునిలా అవ్వండి, మాయతో ఓడిపోవటంలో అంగదునిలా అవ్వకండి, విజయులుగా అయ్యేందుకు అంగదునిలా అవ్వండి. అచ్ఛా!

ఉన్నతోన్నతుడైన తండ్రి ద్వారా పాలన తీసుకునేవారు, విశ్వ పాలనను చేసేవారు, విష్ణు కులానికి చెందిన శ్రేష్ఠ ఆత్మలు, ప్రకృతిని పరివర్తన చేసే పురుషోత్తమ ఆత్మలు, విశ్వము ఎదురుగా సాక్షాత్తు మూర్తులుగా ప్రసిద్ధమయ్యే ఆత్మలు, యోగీ ఆత్మలు, అటువంటివారికి బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్.

వరదానము:- సేవలో ఉంటూ సంపూర్ణత యొక్క సమీపతను అనుభూతి చేసే బ్రహ్మాబాబా సమానమైన ఉదాహరణ స్వరూప భవ

బ్రహ్మాబాబా సేవలో ఉంటూ, సమాచారాన్ని వింటూ కూడా ఏకాంతవాసిగా అయిపోయేవారు. ఒక గంట సమాచారము గురించి 5 నిముషాలలో సారాన్ని అర్థం చేసుకుని, పిల్లలను సంతోషపరచి, తన అంతర్ముఖీ, ఏకాంతవాసీ స్థితిని అనుభవము చేయించేవారు. అలా బాబాను ఫాలో చెయ్యండి. బ్రహ్మాబాబా ఎప్పుడూ కూడా - నేను చాలా బిజీగా ఉన్నాను అని అనలేదు. కానీ పిల్లల ముందు ఉదాహరణగా అయ్యారు. అలా సమయమనుసారంగా ఇప్పుడు ఈ అభ్యాసము యొక్క అవసరము ఉంది. హృదయము యొక్క లగనము ఉన్నట్లయితే సమయము దొరుకుతుంది మరియు అనేకులకు ఉదాహరణగా అవుతారు.

స్లోగన్:- ప్రతి కర్మలో - కర్మ మరియు యోగము అనుభవము అవ్వటమే కర్మయోగము.

అవ్యక్తి సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

మేము బాబా సమానంగా అవ్వాలి అని సదా ఈ లక్ష్యమే గుర్తుండాలి, అప్పుడు ఏ విధంగా బాబా లైట్ గా ఉంటారో, అలా డబుల్ లైట్ గా ఉంటారు. ఇతరులను చూస్తే బలహీనులుగా అవుతారు, అందుకే సీ ఫాదర్, ఫాలో ఫాదర్... (తండ్రినే చూడండి, తండ్రినే అనుసరించండి). ఎగిరే కళకు శ్రేష్ఠ సాధనము కేవలము ఒకే ఒక్క మాట - సర్వస్వమూ నీదే. నాది అన్న పదాన్ని మార్చి నీదిగా చెయ్యండి. నీ వాడిని అని అనుకున్నప్పుడు ఆత్మ లైట్ గా ఉంటుంది

మరియు అన్నీ నీవే అయినప్పుడు లైట్ (తేలిక) గా అయిపోతారు.